క్లుప్తంగా

ఆలయానికి గరుడవాహనం అందజేత



ఆలయానికి గరుడవాహనం అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలనాథస్వామి ఆలయానికి దాతలు ఉత్సవాలకు వినియోగించే గరుడవాహనం అందజేశారు. ఈ ఒంగోలుకు చెందిన ఆవుల చంద్రశేఖర్, ఆవుల శిరీష, ఆవుల షన్ముఖులు ఆలయ అర్చకులు రామమూర్తికి అందజేశారు. అనంతరం గరుడ వాహనానికి అర్చకులు విశిష్ట పూజలు నిర్వహించి దాతలకు స్వామివారం తీర్థ ప్రసాదాలు అందజేశారు. గంట శ్రీనివాస రెడ్డి, టి.కొండారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వంశీకృష్ణ, అఖిల, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

పామూరు: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 2న తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి, సీపీఐ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా గుజ్జుల యల్లమందారెడ్డి భవన్‌లో శనివారం ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎన్నికల వేళ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను కూటమి ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్లు



వెంకటేశ్వరుని విగ్రహమూర్తిని జలధి స్నానానికి తీసుకుపోతున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకులు కేశవ వేద మంత్రాలతో అమ్మవారి మూల విగ్రహమూర్తికి అభిషేకం, కుంకుమపూజ చేశారు. అనంతరం వెంకటేశ్వర స్వామి విగ్రహమూర్తికి జలధి ఉత్సవానికి తరలించారు. భక్తులు పొంగళ్ల నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎంపీడీఓగా హనుమంతరావు

పీసీపల్లి: పీసీపల్లి ఎంపీడీఓగా హనుమంతరావును నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రభాకర్‌శర్మ కనిగిరికి బదిలీ కాగా, కనిగిరిలో పనిచేస్తున్న హనుమంతరావును పీసీపల్లికి బదిలీ చేశారు.

మత సామరస్యాన్ని కాపాడదాం

కొండపి: ఉగ్రవాదాన్ని, మత విద్వేషాలను నిలువరించి మతసామరస్యాన్ని కాపాడుకుందాం అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. పెరిదేపి ఎంఎస్ విజ్ఞాన కేంద్రంలో శనివారం పెహల్గాం ఉగ్రదాడులు, అనంతరం పరిణామాలు అనే అంశంపై జరిగిన సదస్సుకు మండల కార్యదర్శి మాలకొండయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెహల్గాంలో దాడులు చేసిన ఉగ్రవాదులను నేటికీ ప్రభుత్వం పట్టుకోలేకపోవడం విచారకరమన్నారు. మోదీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద చర్యలకు రాష్ట్రంలోని అధికార కూటమి, ప్రతిపక్ష పార్టీ వంత పాడటం ఆందోళనకరమన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, మండల కమిటీ సభ్యులు ముప్పరాజు బ్రహ్మయ్య, చిన్న పేతురు, బ్రహ్మయ్య, రామారావు, శేషారావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

హనుమంతునిపాడు: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని ఎస్సై ఎం మాధవరావు అన్నారు. స్థానిక కంభం కనిగిరి రహదారిలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రిళ్లు మద్యం సేవించి రోడ్లపై తిరుగుతూ గొడవలకు దిగితే చర్యలు తప్పవన్నారు. ఆటోవాలాలు, ద్విచక్రవాహనదారులు అతివేగంతో వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు.

కష్టాల కాలనీ..!





- సమస్యల వలయంలో తాతయ్య ఎస్టీ కాలనీ
- పనిచేయని బోర్లు, తాగునీటికి బోరు వాటరే దిక్కు
- ఒకటిన్నర కిలోమీటరు నుంచి మంచి నీరు తెచ్చుకుంటున్న కాలనీవాసులు
- కాలనీలో పేరుకుపోయిన చెత్త నిల్వలు
- కాలనీ వైపు తొంగిచూడని అధికారులు

సింగరాయకొండ:

మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ తాతయ్య ఎస్టీ కాలనీవాసులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కాలనీలో సుమారు 40 గృహాల్లో 150 మంది నివసిస్తున్నారు. కాలనీవాసులంతా పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వచ్చి వెళుతుంటారు.

వెంటాడుతున్న తాగునీటి సమస్య..

కాలనీవాసులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. కాలనీలో ఉన్న మూడు బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. వీటిని బాగు చేసే దిక్కులేదు. ఈ కాలనీ మొదట్లో వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసి సమీపంలోని బోరు ద్వారా ట్యాంకును నింపి ఆ నీటితో వాడుకనీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. కాలనీ మొదట్లో ఈ ట్యాంకు ఏర్పాటు చేయటంతో ప్రతి ఒక్కరూ అక్కడికి వచ్చి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి. దీంతో వృద్ధులు నీటిని క్యాన్‌ల ద్వారా మోసుకోలేక ఇబ్బందిపడుతున్నారు. ఈ నీరు వాడుకకు తప్ప తాగేందుకు పనికిరాదు. దీంతో మోటారు సైకిల్ ఉన్న కుటుంబాల వారు ఒకటిన్నర కిలోమీటరు దూరంలోని హైస్కూల్ ముందు ఉన్న బోరు నుంచి నీటిని తెచ్చుకుంటారు. మోటారుసైకిల్ లేనివారు అరకిలోమీటరు దూరం నుంచి వాటర్‌ప్లాంట్ వద్ద నీటిని కొనుగోలు చేసి తాగునీటి అవసరాలను తీర్చుకుంటారు. వృద్ధులైతే గత్యంతరం లేక తాగేందుకు పనికిరాని ట్యాంకులోని నీటిని తెచ్చుకుని తాగాల్సిన దుస్థితి ఉంది.



కాలనీ బయట ఏర్పాటు చేసిన వాటర్‌ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న కాలనీవాసి



ఒకటిన్నర కిలోమీటర్ నుంచి మంచినీరు తెచ్చుకుంటున్న కాలనీవాసులు

అధ్వానంగా పారిశుధ్యం..

కాలనీకి ఏనాడు పారిశుధ్య కార్మికులు వచ్చిన దాఖలాలు లేవు. దీంతో కాలనీలో రోడ్లు వీరే చిమ్ముకుంటూ పేరుకుపోయిన చెత్తను తగలబెట్టుకుంటారు. చిన్నపాటి గాలి వీచినా కాలనీలో కరెంట్ సరఫరా నిలిచిపోతుంది. ఈ నెల నుంచి రేషన్ వాహనం రాదని తెలియడంతో కాలనీవాసులు అల్లాడిపోతున్నారు. కాలనీ నుంచి రేషన్ దుకాణం రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాలి. అంతదూరం నుంచి రేషన్ సరుకులు ఎలా తెచ్చుకోవాలని వారంతా తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీని పట్టించుకోని అధికారులు

సమస్యల వలయంలో ఉన్న ఈ కాలనీ గురించి ఏ అధికారి పట్టించుకోరు. ఏ ప్రజాప్రతినిధి గానీ, అధికారులు గానీ సిబ్బంది గానీ ఈ కాలనీ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులైతే కాలనీ ఎక్కడో తెలియదని, సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని చెబుతున్నారని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇక పంచాయతీ కార్యదర్శి ఆ పక్కకే రాదని మా గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావటం లేదంటున్నారు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన బోరు

వైభవంగా ప్రతిష్టా మహోత్సవం



పార్టీ నాయకులతో సమావేశమైన బూచేపల్లి, నేతలు

జరుగుమల్లి(సింగరాయకొండ): మండల కేంద్రంలో శనివారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయం సెంటర్లో ఆంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తరువాత పార్టీ నాయకులు దగ్గుమాటి బూసిరెడ్డి నివాసంలో అల్పాహారం సేవించి మండలంలో పార్టీ బలోపేతంపై చర్చించారు. పార్టీ మండల అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసులు, సర్పంచ్ కె.పున్నారావు, ఉప సర్పంచ్ దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, దగ్గుమాటి శంకరరెడ్డి, అంజిరెడ్డి, కొరకూటి వెంకటేశ్వర్లు, సర్పంచ్ నాగినేని భాస్కర్, సర్పంచ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఆంజనేయునికి పూజలు నిర్వహిస్తున్న బూచేపల్లి, ఆదిమూలపు

దయనీయంగా పొగాకు రైతుల పరిస్థితి

కొండపి: పొగాకు రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, వ్యాపారులపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి పొగాకు కొనుగోలు చేయించాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలితకుమారి, జిల్లా సహాయ కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. వేలం కేంద్రంలో జరుగుతున్న వేలాన్ని శనివారం పరిశీలించి వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్‌తో మాట్లాడారు. పొగాకుకు కేజీ సరాసరి ధర రూ.300లకు కొనుగోలు చేయాలని, బర్లీ పొగాకు రూ.15 వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని కోరారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి పొగాకు నాణ్యత లేదని, విదేశీ ఆర్డర్లు లేవని కుంటి సాకుతో ధర ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కౌలు రైతులు పీకల్లోతుల్లో నష్టాల్లో కూరుకుపోతున్నారని, ఏ పంట వేస్తే గిట్టుబాటు అవుతుందో తెలియని అగమ్యగోచర పరిస్థితులలో రైతులు వ్యవసాయం చేస్తున్నారన్నారు. రైతులు తక్కువ ధరలకు పొగాకు అమ్ముకున్న తర్వాత విదేశీ ఆర్డర్లు వస్తాయని చెప్పేలా మోసం చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకుంటే రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు శివరామకృష్ణయ్య, వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.



వేలం నిర్వహణ అధికారితో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నేతలు

పోలేరమ్మతల్లి హుండీ ఆదాయం రూ.22.17 లక్షలు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని కామేపల్లి పోలేరమ్మ తల్లి ఆలయ హుండీని శనివారం లెక్కించారు. గత ఏడాది నవంబర్ 18 నుంచి మే 30వ తేదీ వరకు హుండీ లెక్కించగా రూ.22,17,367 వచ్చినట్లు ఆలయ ఈఓ భైరాగి ఒక ప్రకటనలో తెలిపారు. వల్లూరమ్మ దేవస్థానం ఈఓ రమేష్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు.

మాలకొండ ఆదాయం రూ.11,92,209

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం శనివారం ఆదాయం రూ.11,92,209 వచ్చినట్లు ఆలయ ఈఓ కె.సాగర్ బాబు తెలిపారు. కుంకుమార్చన ద్వారా రూ.22,040, తలనీలాలు రూ.88,375, ప్రత్యేక దర్శనం రూ.5,53,700, రూమ్ అద్దెలు రూ.30,620, లడ్డు ప్రసాదాలు రూ.2,12,290, అన్నదానం రూ.2,33,214, ఇతర విరాళాలు కలిపి ఆదాయం రూ.11,92,209లు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

స్వల్పకాలిక పంటలు సాగు చేసుకోవాలి

కందుకూరు రూరల్: రైతులు స్వల్పకాలిక రకాల పంటలు సాగు చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ జి.ప్రసాద్‌బాబు అన్నారు. మండలంలోని పలుకూరు, మహదేవపురం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధానంగా పొగాకు మినుము, శనగ, వరి పంటలు పండిస్తున్నారన్నారు. వాటిల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వరి పండించే రైతులు నూతన రకాలైన కేఎస్ఎం-1638, ఎన్ఎల్ఆర్-3354, ఎన్ఎల్ఆర్-40054 వంటి స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలన్నారు. ఖర్చు తగ్గించుకోవడానికి నాట్లు వేసే వారి విధానం కాకుండా నేరుగా విత్తే వరి విధానం ద్వారా ఎకరాకు పది వేల రూపాయిలు ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. కందుకూరు నిర్మా పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎం.అనూరాధ మాట్లాడుతూ డ్రోన్ దీదీ అనే కేంద్ర ప్రభుత్వ పథకం కింద స్వయం సహాయ సంఘ మహిళలు 80శాతం సబ్సిడీతో డ్రోన్ తీసుకొని అద్దెకు పిచికారీ చేసుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. కందుకూరు వ్యవసాయ అధికారి వి.రాము మాట్లాడుతూ నేల సారవంతత పెంచుకోవడానికి ప్రతి రైతు పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసుకొని కలియదున్నాలన్నారు. హైదరాబాద్‌లో ఉన్న కోళ్ల పరిశోధనా స్థానం నుంచి విచ్చేసిన ప్రధాన శాస్త్రవేత్త కణ్ణన్ మాట్లాడుతూ రైతులు వాణిజ్య సరళిలో కోళ్లు, పొట్టేళ్లు, పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతులకు వివిధ పంటలలో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై కేంద్ర ప్రభుత్వ పథకాలపై తయారు చేసిన పుస్తకాలను రైతులకు అందజేశారు.



మాట్లాడుతున్న కేవీకే హెడ్ జి.ప్రసాద్‌బాబు

బస్సు, కారు ఢీ

టంగుటూరు: బస్సును కారు ఢీకొన్న ఘటన స్థానిక టంగుటూరు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..సింగరాయకొండ నుంచి టంగుటూరు గ్రామంలోకి ప్రవేశించే ఫ్లై ఓవర్పై టంగుటూరు నుంచి సింగరాయకొండ వైపు వేపై ముందుగా వెళుతున్న బీకేటీ పొగాకు థ్రెషింగ్ కంపెనీకి చెందిన మినీ బస్సు ఒక్కసారిగా పక్కకు తిప్పడంతో వెనుకాలే వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతింది. ప్రమాదంలో బస్సు, కారులోని వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాలేదు. జాతీయ రహదారి పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారును పక్కకు తప్పించారు.



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందుభాగం

ఆశ్రమ భూములు స్వాధీనం చేసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న హేతువాద సంఘం నాయకులు

కందుకూరు: గుడ్లూరు మండలం చేవూరు గ్రామ పరిధిలోని రామదూత స్వామి ఆశ్రమ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 2021లో ఈ భూములకు సంబంధించి ప్రిన్సిపల్ సెక్రటరీ ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చినా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అటవీశాఖకు చెందిన భూములను ఆక్రమించి ఆశ్రమం ఏర్పాటు చేశారని, దీనిపై అనేక ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నామని చెప్పారు. అనాథ పిల్లల ఆశ్రమ పేరుతో భూములను స్వాధీనం చేసుకుని అక్కడ యజ్ఞ, యాగాలు వంటి పూజలు చేస్తున్నారని చెప్పారు. ఇది నిబంధనలకు విరుద్ధమని, దీనిపై అనేక మార్లు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. స్థానికంగా ఉండే అధికారులు ఈ ఆక్రమణలపై పట్టించుకోవడం లేదని, హైకోర్టు తీర్పుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ అడ్వకేట్ కె.అరుణ, హేతువాద సంఘం సభ్యుడు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తా

పామూరు: వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మి నియమితులయ్యారు. ఈసందర్భంగా శనివారం ఎంపీపీ గంగసాని లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి దంపతులు ఒంగోలులో జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్‌లను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా నియమితులైన లక్ష్మిని ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, జెడ్పీటీసీలు గుంటక తిరుపతి రెడ్డి, మడతల కస్తూరిరెడ్డిలు శాలువాతో ఆమెను ఘనంగా సన్మానించారు.పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, మన్నం మాధవ పాల్గొన్నారు.



పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మకు బొకే అందజేస్తున్న ఎంపీపీ దంపతుల

ముగిసిన యోగా శిక్షణ తరగతులు



పామూరులో యోగాపై శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ, డాక్టర్ ఏడుకొండలు



పీసీపల్లిలో యోగా తరగతులు

పామూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, ఉల్లాసం సాధ్యమని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, డాక్టర్ గడ్డె ఏడుకొండలు అన్నారు. స్థానిక సచివాలయంలో జరుగుతున్న యోగా శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. శిక్షణ పొందిన వారు జూన్ 3, 4, 5 తేదీల్లో సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఎంపిక చేసిన వారికి యోగాపై శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. యోగా మాస్టర్ ట్రెనర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పీసీపల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యోగా శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిప్యూటీ ఎంపీడీఓ రాంప్రసాద్ యోగ ట్రెనర్ ప్రసాదు తదితరులు ఉన్నారు

ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

పొన్నలూరు: ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా పనిచేసి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. పొన్నలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం రికార్డులు పరిశీలించి డాక్టర్లు, ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని గర్భిణులకు అవగాహన కల్పించి పీహెచ్‌సీలో కాన్పులు అయ్యేలా చూడాలన్నారు. పీహెచ్‌సీలో గణనీయంగా కాన్పుల సంఖ్య పెరగాలని, లేకుంటే ఆరోగ్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా పల్లెల్లో చేపడుతున్న ఆరోగ్య సర్వేలను సక్రమంగా చేపట్టి రోగుల వివరాలను నమోదు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సమయపాలన పాటించి పీహెచ్‌సీలో ఓపీల సంఖ్య పెంచాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు

ఎన్నికల హామీలకు తూట్లు

కనిగిరిరూరల్: ప్రజా సమస్యలను, సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబు అమరావతి, పోలవరం పేరుతో కాలయాపన చేస్తున్నారని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ నారాయణ ధ్వజమెత్తారు. సీపీఐ నియోజకవర్గ మహాసభలు కనిగిరిలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి సర్కార్ తొంగలో తొక్కి పేదలను మోసం చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. కనిగిరిలో రిలయన్స్ సంస్థకు వందల ఎకరాలకు కట్టపెట్టారని ఘాటుగా విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండా కాగితాలకే పరిమితం చేస్తోందన్నారు. వెలిగొండను పూర్తి చేసేంత వరకు సీపీఐ పోరాటం సాగిస్తోందన్నారు. సీపీఐ జిల్లా నాయకులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్‌లు మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ప్రజా వ్యతిరేక వైఖరిపై పార్టీ శ్రేణులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ట్రిపుల్ ఐటీ, నిమ్జ్, వెలిగొండ ప్రాజెక్టు జలాలు, ఇంటింటికి సాగర్ జలాలను కనిగిరి ప్రాంతానికి అందచేయాలని డిమాండ్ చేశారు. తొలుత స్థానిక పీవీఆర్ పార్క్ వద్ద నుంచి పట్టణ పుర వీధుల్లో ర్యాలీ సాగింది. షాదీఖాన వద్ద సభ ప్రాంగణంలో సీపీఐ నేత వై రవీంద్రబాబు జెండా ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు బ్యంగి సుబ్రహ్మణ్యం, ఎస్‌డీ మౌలాలి, జీపీ రామారావు, పందిటి మోహన్, జి.బాలిరెడ్డి, పోతల ప్రభాకర్, సీహెచ్ పవన్‌కళ్యాణ్, వజ్రాల సుబ్బారావు, గులాం హుస్సేన్, జయంపు పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో సీపీఐ శ్రేణులు

204 పొగాకు బేళ్లు తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం జరిగిన వేలంలో 204 పొగాకు బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. జమ్ములపాలెం, తుమాడు గ్రామాలకు చెందిన రైతులు 629 బేళ్లను వేలానికి తీసుకురాగా 425 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సరాసరి ధర రూ.249.61 పలికింది. వేలంలో 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 197 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని మూగచింతల, గుర్రప్పడియ, నెన్నూరుపాడు, కె.అగ్రహారం, చతుకుపాడు గ్రామాలకు చెందిన రైతులు 759 బేళ్లను వేలానికి తీసుకురాగా 562 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సరాసరి ధర రూ.241.34గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలు పాల్గొన్నాయి.

5న ఎడ్ల బండలాగుడు పోటీలు

సీఎస్ పురం (పామూరు): రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 5వ తేదీ సీఎస్ పురంలో కాపు నాయుడుల ఆధ్వర్యంలో సీనియర్ విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులుగా వరుసగా రూ.1,00,116, రూ.75,116, రూ.50,116, రూ.30,116, రూ.20,116, రూ.15,116, రూ.10,116 అందజేయనున్నట్లు వివరించారు. ఆసక్తి గల ఎడ్లజతల యజమానులు 4వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9010555511, 9703706530, 9985330414 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.